

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

RNI APTEL 2013/54510

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 300 | పేజీలు - 08 | వెల - 05/- | మంగళవారం 27-10-2026


కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి.



# అర్ణబ్ తుపాను..

కోస్తాంధ్రలోని 11 జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలకు అవకాశం

# ఏపీకి భారీ వర్ష సూచన

- బంగాళాఖాతంలో 'అర్ణబ్' తుపాను
- యానాం వద్ద ఈ నెల 28న తీరం దాటనున్న తుపాను
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గంట గంటకూ పరిస్థితిని సమీక్షిస్తూ, రాష్ట్ర యంత్రాంగాన్ని సర్వసన్నద్ధం చేస్తున్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నివారించడమే లక్ష్యంగా ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు, ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వర్చువల్‌గా సమీక్షలు



నిర్వహిస్తున్నారు. తుపాను గమనాన్ని, ప్రభుత్వ చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కీలక ఆదేశాలు జారీ చేస్తున్నారు. భారత వాతావరణ విభాగం (×వీణ) హెచ్చరికల ప్రకారం, అర్ణబ్ తుపాను రేపటికల్లా తీవ్ర తుపానుగా బలపడి రాష్ట్రంపై ప్రభావం చూపనుంది. ఈ నెల 28వ తేదీన బాపట్ల-విశాఖ మధ్య యానాం వద్ద ఇది తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తుపాను ప్రభావంతో రేపు మధ్యాహ్నం నుంచి ఉత్తర కోస్తాంధ్ర, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పలనాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు.

మిగతా 2లో

## తెలంగాణ ప్రతిపాదనకు ఫడ్నవీస్

# సానుకూలం!

- తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపుపై ఫడ్నవీస్ సానుకూలం
- 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రతిపాదన
- అధ్యయనానికి అధికారుల కమిటీ ప్రతిపాదన
- రెండు లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం
- ముంపు భూములకు పరిహారం చెల్లిస్తామని హామీ



తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల సాగునీటి కల నెరవేరే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచాలన్న తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. ఎత్తు పెంపుతో మహారాష్ట్రకు ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండకూడదని స్పష్టం చేస్తూనే.. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు అభ్యంతరం లేదని తెలిపారు.

మిగతాది 2లో

# ఆ ఒక్క పని చేయండి.. 30 సెకన్లలో నిరసన ఆపేస్తాం

- నవంబర్ 1న తలపెట్టిన నిరసనపై షరతు పెట్టిన రాహుల్ గాంధీ
- ఆందోళన వాయిదా వేయాలన్న వ్యాపారుల అభ్యర్థనకు తిరస్కరణ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగిస్తే నిరసన ఆగిపోతుందన్న రాహుల్
- పండుగ వేళ ఆందోళనతో రూ.10,000 కోట్ల నష్టం వస్తుందని వ్యాపారులు
- ఎలక్టోరల్ రోల్స్ సవరణపై సీఈసీ రాజీనామాకు విపక్షాల డిమాండ్

2



# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త..

- ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులు త్వరలో జమ
- లబ్ధిదారులు ఆందోళన చెందవద్దన్న మంత్రి పొంగులేటి
- రూ.40 వేల కోట్లతో 8 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం
- తరువాతి విడతల్లోనూ అర్హులకు ఇళ్ల కేటాయింపు

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నిర్మాణం పూర్తిచేసుకుని ఫైనల్ బిల్లుల కోసం

2



## హైదరాబాద్ హత్య కేసులో

# ముఠా అరెస్ట్

● రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసులో పురోగతి ● ఇంట్లో పనిచేసే యువతి సహా నలుగురు నేపాలీ నిందితుల అరెస్ట్ ● దోపిడీని అడ్డుకోవడంతో మహిళను ఊపిరాడకుండా చేసి హత్య చేసిన ముఠా ● పనిమనిషి ధర్మ అలియాస్ కల్పననే కీలక సూత్రధారిగా గుర్తించిన పోలీసులు ● దేశవ్యాప్తంగా, నేపాల్ సరిహద్దుల్లో ఐదు నెలలు గాలించి నిందితులను పట్టుకున్న సిట్



హైదరాబాద్ నగరంలో తీవ్ర సంచలనం సృష్టించిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రే వినయ్ రంజన్ భార్య తనుజా రంజన్ హత్య కేసులో ఐదు నెలల తర్వాత కీలక పురోగతి లభించింది. ఈ దారుణానికి సూత్రధారిగా వ్యవహరించిన ఇంట్లోని పనిమనిషి ధర్మ అలియాస్ కల్పన సహా నలుగురు నేపాలీ

మిగతాది 2లో

## నేడు ఎల్లుండి సొంత నియోజకవర్గంలో

# జగన్ పర్యటన

● జగన్ రెండు రోజుల పులివెందుల పర్యటన ● నేడు ఉదయం పులివెందులకు చేరుకోనున్న మాజీ సీఎం ● భాకరాపురం క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటు ● రాత్రికి అక్కడే బస చేసి, బుధవారం తిరిగి తాడేపల్లికి పయనం

2



## చెల్లి, మేనకోడలి విషయంలో జగన్ భిన్నంగా

# వ్యవహరిస్తున్నారు

వైసీపీ అధినేత జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్ర విమర్శలు

- మేనకోడలి పెళ్లికి మేనమామగా దీవించాల్సింది పోయి అడ్డుకుంటున్నారని ఆరోపణ
- సొంత కుటుంబం పట్లనే అలా ఉంటే, రాష్ట్ర మహిళలను ఏం చూసుకుంటారని వ్యాఖ్య
- మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీలోకి పలువురు వైసీపీ, సీపీఎం నేతల చేరిక



వైసీపీ అధినేత జగన్ పై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సొంత కుటుంబ సభ్యుల విషయంలోనే జగన్ వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని ట్వీట్ చేశారు. ప్రతి కుటుంబంలో మేనకోడలి పెళ్లికి మేనమామ అన్నీతానై ఆశీర్వదించి పంపుతాడని, కానీ జగన్

మిగతాది 2లో

# ఇలాగైతే ప్రజల మద్దతు పొందలేరు..

## ఆ పార్టీ దుకాణం సర్దేసుకోవడం మంచిది: మంత్రి అనగాని

● స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసీపీ అల్లర్లకు పాల్పడుతోందన్న మంత్రి అనగాని ● పుంగనూరు, తిరుపతి సహా పలుచోట్ల దాడులే ఇందుకు నిదర్శనమని వెల్లడి ● ప్రజలు చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమానికి మద్దతిస్తున్నారని స్పష్టీకరణ ● 11 సీట్లకు పరిమితం చేసినా జగన్ తీరు మారలేదని విమర్శ

మిగతాది 2లో



# ఎన్టీఆర్ దూరదృష్టి ప్రశంసనీయం

- విజయవాడలో ఎన్టీఆర్ వర్సిటీ 40వ వార్షికోత్సవం
- ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- విద్యా, వైద్య రంగాలకు ఎన్టీఆర్ సేవలను కొనియాడిన ఉపరాష్ట్రపతి




భవిష్యత్తులో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# అర్ణబ్ తుపాను.. ఏపీకి భారీ వర్ష సూచన

ఈ నెల 28, 29 తేదీల్లో కొన్ని చోట్ల అత్యంత భారీ



వర్షాలు కూడా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రం తీసుకుంటున్న చర్యలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపు, సహాయక చర్యలు

తుఫాన్ నేపథ్యంలో ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు (షెల్టర్లకు) తరలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, దివ్యాంగులు, బాలింతలు, చిన్నారులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 4,711 మంది గర్భిణీలను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రభావిత జిల్లాల్లో వైద్య బృందాలను, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. సహాయక చర్యల కోసం రాష్ట్రంలో 7 ఎన్డీఆర్ఎఫ్, 8 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను 11 జిల్లాల్లో మోహరించాలని, అదనపు బలగాలను ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల్లో రిజర్వ్‌లో ఉంచాలని ఆదేశించారు. మెరైన్ పోలీసులు, నౌకాదళం, కోస్ట్‌గార్డ్ సేవలను కూడా వినియోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

వ్యవసాయం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

తుపాను వల్ల పంట నష్టం జరగకుండా చూడాలని, ఇప్పటికే కోత కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా రైతులకు సహకరించాలని వ్యవసాయ శాఖకు సీఎం సూచించారు. రాష్ట్రంలో సుమారు 1.82 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించేందుకు సిబ్బందిని, సామగ్రిని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు నిత్యావసరాలు, రేషన్ సరకులు అందుబాటులో ఉంచాలన్నారు.

తుపాను గమనాన్ని బట్టి ప్రతి నాలుగు గంటలకూ ప్రజలకు హెచ్చరికలతో కూడిన బులెటిన్ జారీ చేయాలని సీఎం ఆదేశించారు. గత తుపానుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మరింత పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వదంతులు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. తుపాను తీవ్రతను బట్టి ప్రభావిత ప్రాంతాల్లోని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించే అధికారాన్ని కలెక్టర్లకు అప్పగించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇలాగైతే ప్రజల మద్దతు పొందలేరు..

## ఆ పార్టీ దుకాణం సర్దేసుకోవడం మంచిది: మంత్రి అనగాని

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు, విధ్వంసాలకు పాల్పడుతోందని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల మద్దతు పొందలేకే జగన్ హింసా రాజకీయాలను ఎంచుకున్నారని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

పుంగనూరు, తిరుపతి, రాయచోటి, పులివెందుల, కడప, దర్శి, కనిగిరి వంటి ప్రాంతాల్లో వైసీపీ శ్రేణులు చేసిన దాడులే ఇందుకు నిదర్శనమని అనగాని పేర్కొన్నారు. ఎన్నికలు ఏవైనా హింసను ప్రోత్సహించడమే జగన్ నైజమని, గత ఐదేళ్ల పాలనను చూసి ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా ఆయన తీరులో ఎలాంటి మార్పు రాలేదని అన్నారు. కుట్రలు, దాడులు, విధ్వంసాలతో ప్రజల ఓట్లు సాధించలేరనే వాస్తవాన్ని జగన్ గుర్తించాలని హితవు పలికారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని మంత్రి తెలిపారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఛాంపియన్ కూటమి విజయ దుందుభి మోగిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. "స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు చూసైనా గొడ్డలి పార్టీ నాయకులకు, జగన్ రెడ్డికి బుద్ధి రావాలి. ఇక ఆ పార్టీ దుకాణం సర్దేసుకోవడం మంచిది" అని అనగాని సత్యప్రసాద్ తన ప్రకటనలో వ్యాఖ్యానించారు.

# హైదరాబాద్ హత్య కేసులో ముఠా అరెస్ట్

రంజన్ భార్య తనుజా రంజన్ హత్య కేసులో ఐదు నెలల తర్వాత కీలక పురోగతి లభించింది. ఈ దారుణానికి సూత్రధారిగా వ్యవహరించిన ఇంట్లోని పనిమనిషి ధర్మ అలియాస్ కల్పన సహా నలుగురు నేపాలీ నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో, భారత్-నేపాల్ సరిహద్దుల్లో ఐదు నెలల పాటు గాలించి నిందితులను కదలికలను గుర్తించారు.

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ సోమవారం మీడియా సమావేశంలో ఈ అరెస్టుల వివరాలను వెల్లడించారు. నిందితులైన ధర్మ అలియాస్ కల్పన (26), గణేశ్ బి.కె (31), చంద్ర బహదూర్ థమన్ (44), గణేశ్ బహదూర్ షాహి (37)లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని చెప్పారు.

**పక్కా ప్రణాళికతో దోపిడీ, హత్య**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మే 7, 8 తేదీల మధ్య రాత్రి ప్రశాసన్ నగర్‌లోని తనూజ రంజన్ నివాసంలోకి చొరబడిన నిందితులు, ఆమెను కదలకుండా బంధించి, ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం ఇంట్లోని 225 గ్రాముల బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులతో పరారయ్యారు.

ఈ కేసులో ఇంట్లో పనిచేసే ధర్మ తిరువా అలియాస్ కల్పన (26) కీలక పాత్ర పోషించింది. నేపాల్‌లోని సుర్ఖేత్ జిల్లాకు చెందిన కల్పన, జూన్ 2025లో బంధువుల ద్వారా హైదరాబాద్ వచ్చి, నెలకు రూ. 20,000 జీతానికి తనూజ ఇంట్లో పనికి కుదిరింది. పనిలో చేరినప్పటి నుంచి పుణెలో ఉంటున్న బికాస్ అనే నేపాల్ జాతీయుడితో ఆమె టచ్‌లో ఉంది. యజమానురాలి ఇంట్లో ఉన్న ఆస్తులు, నగదు, బంగారు ఆభరణాల గురించి బికాస్ తరచూ అడిగి తెలుసుకునేవాడు. ఇంట్లో దోపిడీకి సహకరిస్తే వాటా ఇస్తానని ఆశ చూపడంతో కల్పన అంగీకరించింది.

**నేరానికి ముందు ఏం జరిగింది?**

ఏప్రిల్ 2026లో అనారోగ్యంతో ఉన్న తన తండ్రిని చూసేందుకు పుణె వెళ్లిన కల్పన, అక్కడ ఈ ముఠాలోని ఇతర సభ్యులను కలుసుకుంది. మే 4న యజమానురాలు తనూజ బెంగళూరు వెళ్తున్నట్లు తెలియగానే, కల్పన వెంటనే ముఠాకు సమాచారం ఇచ్చింది. దీంతో మహారాష్ట్రలోని రాయగఢ్ జిల్లాలో గణేశ్ బహదూర్ షాహి, శంకర్ చంద్ర లామా, సునీల్ పరియార్ సమావేశమై, అద్దెకు తీసుకున్న మారుతి ఎర్టిగా కారులో పుణె చేరుకున్నారు. అక్కడ మరికొందరితో కలిసి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు.మే 7న ఉదయం, గణేశ్ బి.కె., సురేష్ షాహి అనే ఇద్దరు నిందితులు కల్పనను కలిసి ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఇంట్లోకి ఎలా ప్రవేశించాలో దానిపై చర్చించుకున్నారు. అదే రోజు సాయంత్రం మహాత్మా గాంధీ బస్ స్టేషన్ సమీపంలోని రవీంద్ర బార్ వద్ద ముఠా సభ్యులందరూ సమావేశమై, సుజన్ షాహి అలియాస్ సురేష్ షాహి నేతృత్వంలో రెండు బృందాలుగా విడిపోయారు. గణేశ్ బి.కె., సురేష్ షాహి, శంకర్ లామా దోపిడీ చేసేందుకు ఇంట్లోకి వెళ్లాలని, గణేష్ బహదూర్ షాహి, సునీల్ పరియార్, నేత్ర షాహి బయట నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద కాపలా కాయాలని నిర్ణయించుకున్నారు.

**సుదీర్ఘ దర్యాప్తు, అరెస్టులు**

ప్రణాళిక ప్రకారం, మే 7 రాత్రి కల్పన ఇంటి తలుపులు తీసి ముఠా సభ్యులను లోపలికి అనుమతించింది. ఆ సమయంలో శబ్దం విని మేల్కొన్న తనూజను నిందితులు బంధించి, ఊపిరాడకుండా చేసి చంపేశారు. అనంతరం ఇంట్లోని బీరువాలు పగలగొట్టి బంగారం, విలువైన వస్తువులు తీసుకుని వెనుక గేటు నుంచి పారిపోయారు. నాంపల్లి వద్ద కాపలా ఉన్న బృందాన్ని కలుసుకుని, కాజీపేట వైపు పారిపోయారు. అక్కడ ఒక కొండ ప్రాంతానికి చేరుకుని, దోచుకున్న సొత్తును తొమ్మిది సమాన భాగాలుగా పంచుకుని, చిన్న చిన్న బృందాలుగా విడిపోయి నేపాల్‌కు పారిపోయారు.

ఈ కేసుపై దృష్టి సారించిన సిట్, మే 22న సునీల్ బహదూర్, దొంగ సొత్తు కొనుగోలు చేసిన దిలీప్ బహదూర్‌ను అరెస్ట్ చేసి, వారి నుంచి 26 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకుంది. అనంతరం బెంగళూరు, ముంబై, పుణె, సూరత్, పాట్నా, ఢిల్లీ, లక్నో, ఉత్తరాఖండ్‌లలో ఐదు నెలలకు పైగా దర్యాప్తు చేపట్టింది. నేపాల్ సరిహద్దుల్లోని మారుమూల ప్రాంతాల్లో స్థానిక సమాచార సహాయంతో నిందితుల కదలికలను గుర్తించి, సోమవారం నాడు ప్రధాన నిందితులైన కల్పన, గణేశ్ బి.కె., చంద్ర బహదూర్ తమాంగ్, గణేశ్ బహదూర్ షాహిలను అరెస్ట్ చేసింది. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

# ఆ ఒక్క పని చేయండి.. 30 సెకన్లలో నిరసన ఆపేస్తాం

ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగిస్తే, తాము తలపెట్టిన ఆందోళనను 30 సెకన్లలోనే విరమించుకుంటామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. నవంబర్ 1న ఢిల్లీలో విపక్ష 'ఇండియా' కూటమి తలపెట్టిన భారీ నిరసనను వాయిదా వేయాలని వ్యాపారులు కోరిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

వివరాల్లోకి వెళితే, ఎలక్టోరల్ రోల్స్‌లో ప్రత్యేక సవరణలకు (సర్) సంబంధించి వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. అయితే, నవంబర్ 8న దీపావళి, 6న ధన్‌తేరస్ ఉన్నందున, పండుగ సీజన్‌లో ఈ ఆందోళన నిర్వహిస్తే వ్యాపార కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల దాదాపు రూ.10,000 కోట్ల మేర నష్టం వాటిల్లుతుందని, కాబట్టి నవంబర్ 10 తర్వాత నిరసన చేపట్టాలని కోరుతూ రాహుల్ గాంధీకి లేఖ రాసింది.

వ్యాపారుల అభ్యర్థనను రాహుల్ గాంధీ తోసిపుచ్చారు. ఈ విషయంపై ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రభుత్వం మెట్రోను మూసివేసి, రోడ్లకు సీల్ వేసి, రాజధానిని లాక్‌డౌన్ చేసిందని, దొంగిలించబడిన ఓటుతో ఏదీ సురక్షితం కాదని విమర్శించారు. అనంతరం వ్యాపారులతో మాట్లాడుతూ, "నిందితుడు నంబర్ 4 అయిన జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించమని మోదీకి చెప్పండి. 30 సెకన్లలో నిరసనలు ఆగిపోతాయి" అని తేల్చిచెప్పారు. కేవలం ధన్‌తేరస్ రోజునే ఢిల్లీ మార్కెట్లలో సుమారు రూ.25,000 కోట్ల టర్నోవర్ జరుగుతుందని అంచనా. ఇంతటి కీలక సమయంలో ఆందోళన చేపట్టడంపై వ్యాపార వర్గాలు ఆందోళన చెందుతున్నప్పటికీ, సీఈసీ రాజీనామా విషయంలో వెనక్కి తగ్గేది లేదని విపక్షాలు స్పష్టం చేస్తున్నాయి.



# చెల్లి, మేనకోడలి విషయంలో జగన్ భిన్నంగా వ్యవహరిస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఆశీర్వదించి పంపుతాడని, కానీ జగన్ మాత్రం అందుకు భిన్నంగా ప్రవర్తిస్తున్నారని లోకేశ్ తెలిపారు. దివంగత వైఎస్సార్ సొంత ఇంట్లో ఆయన మనవరాలి పెళ్లి జరగకుండా జగన్ అడ్డుకుంటున్నారని లోకేశ్ ఆరోపించారు. "సొంత చెల్లెలి విషయంలోనే ఇలా ప్రవర్తిస్తే, గత ఐదేళ్లలో రాష్ట్రంలోని మహిళలను, సోదరీమణులను ఆయన ఎలా చూసుకున్నారో ప్రజలకు ఇప్పటికే అర్థమైంది" అని లోకేశ్ వ్యాఖ్యానించారు. సొంత కుటుంబానికే న్యాయం చేయలేని వ్యక్తి, రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తారని ఆయన ప్రశ్నించారు.

**లోకేశ్ సమక్షంలో చేరికలు** :మరోవైపు, ఉండవల్లిలోని తన నివాసంలో పలువురు నేతలను నారా లోకేశ్ టీడీపీలోకి ఆహ్వానించారు. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన సీపీఎం నేతలు శివన్నారాయణ (కొలనుకొండ), ముసలి జ్యోతిబసు (ఆత్మకూరు)లతో పాటు వైసీపీ నేతలు నూతలపాటి చెన్నకేశవరావు (పేరుకలపూడి), ఉయ్యూరు వెంకటేశ్వరరావు (ఈమని), ముద్రబోయిన శ్రీను, షేక్ యూసబ్ (చిలువూరు) టీడీపీలో చేరారు. వీరందరికీ లోకేశ్ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. వీరితో పాటు పెద్ద సంఖ్యలో వైసీపీ, సీపీఎం కార్యకర్తలు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

## నేడు ఎల్లుండి సొంత నియోజకవర్గంలో జగన్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో (మంగళ, బుధవారాల్లో) ఆయన పర్యటన ఖరారైంది. ఈ సందర్భంగా రేపు, ఎల్లుండి ఆయన స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం, జగన్ మంగళవారం (27వ తేదీ) ఉదయం 10:30 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి పులివెందులకు చేరుకుంటారు. అనంతరం భాకరాపురంలోని తన క్యాంపు కార్యాలయానికి వెళ్లి, అక్కడ ప్రజలను కలుసుకుంటారు. వారి సమస్యలు, వినతులను స్వీకరించేందుకు అందుబాటులో ఉంటారు. ఆ రోజు రాత్రికి పులివెందులలోని తన నివాసంలోనే బస చేస్తారు. రెండు రోజుల పర్యటన ముగించుకుని బుధవారం (28వ తేదీ) ఉదయం ఆయన పులివెందుల నుంచి తిరిగి తాడేపల్లిలోని తన నివాసానికి బయలుదేరి వెళ్లనున్నారు.

## ఎన్టీఆర్ దూరదృష్టి ప్రశంసనీయం

(మొదటి పేజీ తరువాయి)

వర్సిటీ 40వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యా, వైద్య, సంక్షేమ, సాంస్కృతిక రంగాలతో పాటు తెలుగు భాషాభివృద్ధికి దివంగత ఎన్టీ రామారావు అందించిన సేవలను ఆయన కొనియాడారు. దేశంలోనే తొలి హెల్త్ యూనివర్సిటీని స్థాపించడంలో ఎన్టీఆర్ చూపిన దూరదృష్టి ప్రశంసనీయమని తెలిపారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా చెన్నైకి తాగునీరు అందించిన ఆయన మానవతా దృక్పథాన్ని గుర్తుచేశారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో వికసిత భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీలు, సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని రాధాకృష్ణన్ తెలిపారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కొత్త పరిష్కారాలు కనుగొనేందుకు వర్సిటీ విద్యార్థులు అంతర్జాతీయ పరిశోధనల్లో రాణించాలని సూచించారు. వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీల ప్రాధాన్యం పెరుగుతున్నప్పటికీ, వైద్యులు మానవత్వాన్ని ఎన్నడూ మరువరాదని ఆయన హితవు పలికారు. రోగుల పట్ల కరుణ, మానవత్వం, ఆత్మీయత చూపడమే వైద్య వృత్తిలో అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. సమాజంలో మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, దాని దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు వైద్యులు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త..

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నిర్మాణం పూర్తిచేసుకుని ఫైనల్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి త్వరలోనే ఆ మొత్తాన్ని జమ చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఇల్లు పూర్తయినా ఫైనల్ బిల్లు ఇంకా రాలేదని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోని నిరుపేదలకు పక్కా గృహాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున, మొత్తం రూ.40 వేల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. మొదటి విడతలో ఇళ్లు మంజూరు కాని అర్హులైన పేదలు నిరాశ చెందవద్దని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం దశలవారీగా ఈ పథకాన్ని అమలు చేస్తుందని, మూడు, నాలుగో విడతల్లో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి ప్రకటనతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని, తుది చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్న వేలాది పేద కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. త్వరలోనే తమ ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతాయన్న నమ్మకం వారిలో వ్యక్తమవుతోంది.

## తెలంగాణ ప్రతిపాదనకు ఫడ్నవీస్ సానుకూలం!

(మొదటి పేజీ తరువాయి)

సానుకూలంగా స్పందించారు. ఎత్తు పెంపుతో మహారాష్ట్రకు ఎలాంటి ప్రతికూల ప్రభావం



ఉండకూడదని స్పష్టం చేస్తూనే.. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు అభ్యంతరం లేదని తెలిపారు. అయితే, బ్యారేజీ ఎత్తు పెంపుపై తుది నిర్ణయం తీసుకునే ముందు అన్ని అంశాలపై సమగ్ర అధ్యయనం చేయాల్సి ఉందని అన్నారు.

ముంబైలోని సహ్యాద్రి రాష్ట్ర అతిథిగృహంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం ఫడ్నవీస్‌తో సోమవారం సమావేశమైంది. నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. గతంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం బ్యారేజీ ఎత్తు 148 మీటర్లుగా ఉంది. అయితే, ఆ ఎత్తుతో ఆశించిన స్థాయిలో నీటిని తరలించడం సాధ్యం కాదని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. అందుకే 152 మీటర్లకు పెంచాలని కోరుతోంది.

అధ్యయనానికి అధికారుల కమిటీ

బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలు, పరిహారం వంటి అంశాలపై రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలపైనా అధ్యయనం చేయాలని సూచించారు. కేంద్ర జల సంఘం కూడా తన పరిధిలో సాంకేతిక అంశాలను పరిశీలించనుంది.

రెండు లక్షల ఎకరాలకు సాగునీరు :తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం. గిరిజన, అటవీ ప్రాంతాల్లో సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రాజెక్టు కీలకమని రేవంత్‌రెడ్డి వివరించారు. బ్యారేజీ వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు అక్కడి నిబంధనల ప్రకారం పూర్తి పరిహారం చెల్లిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. బ్యారేజీ ఎత్తు ఖరారైతే తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించే మార్గం రూపకల్పన, భూసేకరణ వంటి పనులను వేగవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. చర్చలు సానుకూలంగా సాగినా.. నిర్మాణానికి తుది అనుమతి లభించిందని ఇప్పుడే చెప్పలేం. అధికారుల అధ్యయనం, తదుపరి చర్చల తర్వాతే దీనిపై స్పష్టత రానుంది.

## ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

హోళగుంద పల్లె వెలుగు అక్టోబర్ : 26 హొళగుంద మండల కేంద్రంలో మహర్షి వాల్మీకి



జయంతి సందర్భంగా నాయకులు ఈడిగ గోవింద్ గౌడ్ మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోవింద్ గౌడ్ మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సంస్కృతికి, ధర్మానికి, మానవీయ విలువలకు గొప్ప మార్గదర్శకమని అన్నారు. మహర్షి వాల్మీకి జీవితం సమాజానికి స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో, పరస్పర గౌరవంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి ఆశయాలను భావితరాలకు అందించడం, ఆయన బోధించిన విలువలను ఆచరించడం మనందరి బాధ్యత అని తెలిపారు. ఈ జయంతి వేడుకలు సమాజంలో ఐక్యతను, సోదరభావాన్ని మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి నాయకులు, ఎస్ పంపపతి , యారిస్వామి, దీదీ వెంకటేష్, బగోడి రాము, కనయ్య, గ్రామ పెద్దలు పాల్గొని మహర్షి వాల్మీకి సేవలను స్మరించుకున్నారు.

## 33వ వార్డులో టీడీపీ అభ్యర్థి డీకే జగదీష్ జోరుగా ప్రచారం.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మున్సిపాలిటీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా 33వ వార్డులో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఈ



నేపథ్యంలో టీడీపీ తరపున కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డీకే జగదీష్ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆదోని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కొంక మీనాక్షి నాయుడు ఆశీస్సులతో, పార్టీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు సూచనల మేరకు, భూపాల్ చౌదరి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు జగదీష్ తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుస్తూ పార్టీ విధానాలను వివరిస్తూ తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

టీడీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి తెలుగుదేశం పార్టీ తరపున బలపరిచిన టి. మణికి కూడా ఓటు వేసి గెలిపించాలని డీకే జగదీష్ ఓటర్లను కోరారు. 33వ వార్డు అభివృద్ధితో పాటు పట్టణ అభివృద్ధికి టీడీపీ అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్‌గా తనకు, చైర్‌పర్సన్ అభ్యర్థిగా టి. మణికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన మనస్ఫూర్తిగా కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఎన్నికల ప్రచారాన్ని మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన "జై తెలుగుదేశం.. జై సీబీఎన్" అంటూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.

## శ్రీ సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు నగరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డితో పాటు పలువురు పార్టీ ప్రముఖులు సోమవారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో కర్నూలు మేయర్ అభ్యర్థి శ్రీమతి సుశీలమ్మ, 38వ వార్డు కార్పొరేటర్ ప్రవళిక, 39వ వార్డు కార్పొరేటర్ చిట్టిబాబు తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నాయకులకు వేద ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

అనంతరం ఆలయ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ టి. శివరామకృష్ణ ఆలయానికి విచ్చేసిన ముఖ్య నాయకులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. స్వామివారి దివ్య ఆశీస్సులు అందుకున్న అనంతరం నేతలు తమ ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు బయలుదేరి వెళ్లారు.

## శ్రీ చౌడేశ్వరి దేవస్థానం నకు భక్తుల విరాళం



బనగానపల్లె, అక్టోబర్ 26,పల్లెవెలుగు మండలం లోని నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు నంద్యాల జిల్లా, బనగానపల్లి మండలం, నందవరం గ్రామ వాస్తవ్యులు కీ"శే" దత్తయ్య గారి చిన్న గోవిందప్ప వారి ధర్మపత్ని కీ"శే" వెంకటమ్మ గారి జ్ఞాపకార్థం వారి కుమారుడు దత్తయ్య గారి హరికృష్ణ వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు 1,00,116/- రూ" చందాను ఆలయ డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు అందచేశారు.

# మహర్షి వాల్మీకి ఆశయాలు విద్యార్థులకు ఆదర్శం.

**-మిల్టన్ గ్రామర్ హైస్కూల్‌లో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు.**

ఆదోని (పల్లె వెలుగు): ఆదోనిలోని మిల్టన్ గ్రామర్ హైస్కూల్‌లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదికవి మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను, ఆయన రచించిన రామాయణ మహాకావ్యంలోని గొప్ప సందేశాలను విద్యార్థులకు వివరిస్తూ కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ హెచ్. రమేష్ బాబు అధ్యక్షత వహించారు. సీఈఓ బి. వెంకటేశులు, ప్రిన్సిపాల్ బి. నాగరాజు, ఇన్‌చార్జ్ సుశీల, జై సింహ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైతిక విలువలను అలవర్చుకోవాలి

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి భారతీయ సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన రచించిన రామాయణం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ధర్మబద్ధమైన జీవన విధానానికి మార్గదర్శకంగా నిలుస్తోందని వివరించారు.

రామాయణం కేవలం ఒక ఇతిహాసం మాత్రమే కాదని, మానవ జీవితానికి విలువైన సందేశాలను అందించే మహోన్నత గ్రంథమని తెలిపారు. శ్రీరాముని ఆదర్శ వ్యక్తిత్వం, సీతాదేవి సహనం, లక్ష్మణుని సోదర ప్రేమ, భరతుని త్యాగం, హనుమంతుని భక్తి, ధైర్యం, సేవాభావం వంటి సద్గుణాలను విద్యార్థులు తమ జీవితాల్లో అలవర్చుకోవాలని సూచించారు.

విద్యతోపాటు వ్యక్తిత్వ వికాసం ముఖ్యం

విద్యార్థులు చదువుతోపాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, మానవత్వం, సేవాభావాన్ని



పెంపొందించుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. తల్లిదండ్రులను గౌరవించడం, గురువులను ఆదరించడం, సత్యాన్ని పలకడం, ధర్మాన్ని ఆచరించడం, ఇతరులకు సహాయం చేయడం వంటి మంచి లక్షణాలను చిన్ననాటి నుంచే అలవర్చుకోవాలని తెలిపారు.

మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, మంచి ఆలోచనలు, సత్కార్యాల ద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకొని పట్టుదలతో చదివి, తల్లిదండ్రులకు, గురువులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన

పాఠశాలల్లో మహనీయుల జయంతి వేడుకలను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, మహనీయుల జీవిత విశేషాలపై అవగాహన పెరుగుతుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తి, పెద్దల పట్ల గౌరవం, సామాజిక బాధ్యత, మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపింది.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ విద్యతోపాటు నైతిక విలువలు, సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది.

ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ హెచ్. రమేష్ బాబు, సీఈఓ బి. వెంకటేశులు, ప్రిన్సిపాల్ బి. నాగరాజు, ఇన్‌చార్జ్ సుశీల, జై సింహ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మహర్షి వాల్మీకి ఆశయాలను, రామాయణంలోని ఆదర్శాలను విద్యార్థులు తమ జీవితాలకు మార్గదర్శకంగా తీసుకొని మంచి పౌరులుగా ఎదగాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది.

# కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి.

**జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపునకు అన్ని సదుపాయాలు సిద్ధం చేయాలి.**

**జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి కౌంటింగ్ కేంద్రాల పరిశీలన.**

ఆదోని (పల్లె వెలుగు): జెడ్పీటీసీ, ఎంపీటీసీ



ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. కౌంటింగ్‌కు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆదోని మండలం విరుపాపురం గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌తో కలిసి పరిశీలించారు.

భద్రతలో ఎలాంటి నిర్లక్ష్యం వద్దు

కౌంటింగ్ కేంద్రాల్లో గదుల ఏర్పాటు, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు టేబుళ్లు, సిబ్బంది రాకపోకలకు అనువైన మార్గాలు, రిసెప్షన్ కేంద్రాలు, వాహనాల పార్కింగ్ వంటి అంశాలను కలెక్టర్ పరిశీలించారు. కౌంటింగ్ హాళ్ల ప్రవేశ ద్వారాల వద్ద పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని, హాళ్లలో తగినంత వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు, రిసెప్షన్ కేంద్రాలు, భవనాల ముందు, వెనుక భాగాలతో పాటు పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలన్నారు.

కౌంటింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, లైటింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలను తనిఖీ చేసి, ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని సూచించారు.

సీసీటీవీ నిఘా.. ప్రత్యేక కంట్రోల్ రూమ్

కౌంటింగ్ కేంద్రాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు, ప్రవేశ ద్వారాలు, భవనాల ముందు, వెనుక భాగాలు, పరిసర ప్రాంతాల్లో అవసరమైన సంఖ్యలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

కౌంటింగ్ కేంద్రాల్లోని కీలక ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించేలా కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటి ఫుటేజీని ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, అవసరమైన మానిటర్లు, సాంకేతిక పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు.

కౌంటింగ్ విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, వారి వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలం కేటాయించాలని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే మార్గాలు, ప్రవేశ ద్వారాలు, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లకు సంబంధించిన వివరాలతో స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రిసెప్షన్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బందిని నియమించి, స్టాట్యూటరీ, నాన్‌స్టాట్యూటరీ కౌంటర్లను అవసరానికి అనుగుణంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహణకు పోలీసుల సమన్వయం

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్టమైన పోలీసు భద్రత కల్పిస్తామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వెనుక భాగాల్లో తగినంత వెలుతురు ఉండేలా ఫోకస్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

అన్ని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని ఒకేసారి వీక్షించేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, కీలక ప్రాంతాల్లో జరిగే కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, ఆదోని ఆర్డీఓ అరుణ దేవి, ఆదోని అదనపు ఎస్పీ జయ శర్మ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో టీడీపీలోకి భారీగా చేరికలు

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు నగరంలో మంత్రి టీజీ భరత్ నాయకత్వంపై నమ్మకంతో వివిధ వార్డులకు చెందిన పలువురు నాయకులు, యువత తెలుగుదేశం పార్టీలో చేరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు టీడీపీలో చేరారు. నగరంలోని 29వ వార్డుకు చెందిన డిష్ రాజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. అలాగే 2వ వార్డుకు చెందిన అడ్వకేట్ మోషేష్ బాబు, 19వ వార్డుకు చెందిన షేక్ నజీమా బేగం టీడీపీలో చేరారు. 13వ వార్డుకు చెందిన యువత కూడా తెలుగుదేశం పార్టీలో చేరి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి టీజీ భరత్ నాయకత్వం, కర్నూలు నగర అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషి తమకు నచ్చడంతోనే తెలుగుదేశం పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజల్లో సానుకూల స్పందన వ్యక్తమవుతోందని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు పేర్కొన్నారు.



# స్థానిక ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యం.

**-సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూల స్పందన.**
**-ఏపీ కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప.**

ఆదోని (పల్లె వెలుగు): స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఏపీ స్టేట్ కురుబ కురుమ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూల స్పందన కనిపిస్తోందని తెలిపారు.

ఆదోని మండలం–2 పరిధిలోని పెద్ద హరివాణం గ్రామంలో రెండు ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాన్వి దేవేంద్రప్ప మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతోందని, ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు ప్రజల మద్దతు లభిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

సంక్షేమ పథకాలే విజయానికి బాటలు

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, అన్న క్యాంటీన్లలో ఐదు రూపాయలకే భోజనం వంటి పథకాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని దేవేంద్రప్ప పేర్కొన్నారు. ఇంటింటి ప్రచారంలో ప్రజలు ప్రభుత్వ పథకాల గురించి ప్రస్తావిస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమ



ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజలు తమకు నచ్చిన అభ్యర్థులను ఎన్నుకుంటారని అన్నారు. స్థానిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు చేస్తూ, ఎన్నికల్లో ప్రజల తీర్పే అంతిమమని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే పార్టీలకే ఆదరణ లభిస్తుందని వ్యాఖ్యానించారు.

ఆదోని మున్సిపాలిటీలోనూ ముమ్మర ప్రచారం

ఆదోని మున్సిపల్ ఎన్నికల్లోనూ టీడీపీ విజయమే లక్ష్యంగా ప్రచారాన్ని ముమ్మరం చేసినట్లు మాన్వి దేవేంద్రప్ప తెలిపారు. కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మతో కలిసి పట్టణంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి సి. మణితో పాటు కౌన్సిలర్ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పథకాలను వివరిస్తూ ఓటర్ల మద్దతు కోరారు.

వాల్మీకి మహర్షి ఆశయాలు అందరికీ ఆదర్శం

అనంతరం మహర్షి వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న మాన్వి దేవేంద్రప్ప, వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి రచించిన రామాయణం మానవ జీవితానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. సత్యం, ధర్మం, న్యాయం, మానవతా విలువలను రామాయణం బోధిస్తుందని తెలిపారు. మనిషి జీవితంలో ఎలా నడుచుకోవాలి, ధర్మబద్ధంగా ఎలా జీవించాలి అనే విషయాలను రామాయణం తెలియజేస్తుందని అన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని కులమత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. మహర్షి ఆశయాలను ఆచరిస్తూ సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించాలని ఆకాంక్షించారు.

# పంట నష్టపరిహార జాబితా సామాజిక తనిఖీ కోసం ప్రదర్శన.

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక గడివేముల మండలం ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించడం జరిగింది.



అన్ని గ్రామాలలో రైతు సేవ కేంద్రం నందు పంట నష్ట పరిహార జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించడం జరిగింది. గడివేముల మండలంలో 8,460 మంది రైతులకు 7811 హెక్టార్లు పంట నష్టం నమోదు చేయబడింది.

కావున రైతులందరూ రెండు రోజుల లోపు మీ యొక్క రైతు సేవ కేంద్రం సందర్శించి మీ యొక్క పంట వివరములు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలి. ఈ కేవైసీ ద్వారా మీ వివరాలు ధ్రువీకరించాలి. ఏమైనా అభ్యంతరాలు ఉన్న, పంట నమోదు కాకున్న అర్జీ ఇవ్వగలరు.

ఈ కేవైసీ చేసుకున్న రైతులకు మాత్రమే పంట నష్ట పరిహారము మరియు పంట బీమా డబ్బులు వస్తాయి.

క్రింద ఇవ్వబడిన లింకు ద్వారా మీరు మీ మొబైల్ ఫోన్ లో పీకేవైసీ ద్వారా మీ పంట నమోదు వివరాలను ధృవీకరించగలరు.

గడివేముల గ్రామంలో పంట నష్ట పరిహార జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించడం జరిగింది అలాగే గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి వెంకట రమణ, మండల వ్యవసాయ అధికారి జీకే . పవన్ కుమార్, ఇఖ. చిన్న స్వామి పంచాయతీ సెక్రటరీ,గ్రామ రెవెన్యూ అధికారి ఎచీచీ ప్రసాధు నాయుడు,వ్యవసాయ విస్తరణ అధికారి మోహన్ బాబు,గ్రామ వ్యవసాయ సహాయకులు విజయ్ రాజు, సచివాలయ సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి.

**-పోలింగ్ కేంద్రాలు, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జె. వెంకట మురళి.**
**-బ్యాలెట్ బాక్సుల పనితీరును తనిఖీ చేసి, ఎన్నికల సామగ్రి భద్రతపై సమీక్ష.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జె. వెంకట మురళి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

సోమవారం నంద్యాల పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేసిన రిసెప్షన్ కౌంటర్, డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌ను జనరల్ అబ్జర్వర్ పరిశీలించారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేసే ప్రక్రియ సజావుగా జరిగేలా చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల సామగ్రి



పంపిణీలో స్పష్టమైన విధానాన్ని అనుసరించాలని, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఎన్నికల సామగ్రి భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలిస్తూ, నిర్దేశిత నిబంధనల ప్రకారం భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

అనంతరం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, అక్కడి ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఓటర్లు సౌకర్యవంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియలో వినియోగించే బ్యాలెట్ బాక్సుల పనితీరును పరిశీలించి, వాటి వినియోగానికి సంబంధించి అవసరమైన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో క్రమబద్ధమైన ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రి భద్రత, సిబ్బందికి అవసరమైన సదుపాయాలు, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జనరల్ అబ్జర్వర్ సూచించారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న, నోడల్ అధికారి శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# 30 ఏళ్ల రాజకీయ అనుభవం.

**-ప్రజాసేవలో ప్రత్యేక గుర్తింపు . -వైసీపీ నేత షేక్ అమీర్ బాషా.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు



షేక్ అమీర్ బాషా రాజకీయాల్లో 30 ఏళ్ల అనుభవంతో కొనసాగుతున్నారు. దాల్ మిల్ అమీర్‌గా పేరొందిన ఆయన వ్యాపార రంగంలో రాణిస్తూనే, రాజకీయాలు మరియు సామాజిక సేవలో తనదైన గుర్తింపు పొందారు. దాల్ ఇండస్ట్రీస్, విత్తన వ్యాపార రంగాల్లో కొనసాగుతున్న ఆయనకు సామాజిక సేవకు గుర్తింపుగా అమెరికన్ యూనివర్సిటీ గ్లోబల్ పీస్ సంస్థ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లో చురుకుగా కొనసాగుతున్న షేక్ అమీర్ బాషా తాజాగా మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పారవి తన పేరును ప్రకటించటంతో తాను చేసే సేవా కార్యక్రమాలు ప్రజలకు అందించడంలో ఇదొక సువర్ణ అవకాశం మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే కల్పించారు. నంద్యాల ప్రజల నన్ను చైర్మన్ గా గెలిపిస్తే ప్రజా సమస్యలతో పాటు మరిన్ని సేవాకార్యక్రమాలు చేస్తానని,నంద్యాల ప్రజల మన్నలతో చైర్మన్ అభ్యర్థిగా గెలుపొంది నంద్యాల ప్రజల సేవకు మరింత దగ్గరయ్యేలా ముందుకు సాగానిస్తారని తెలిపారు .

# తగ్గేదే లేదు 52 వార్డులకు 52 వార్డులు పోటీ చేస్తున్నాం. నంద్యాలలో వైసీపీ జెండా ఎగరవేస్తున్నాం.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. స్థానిక ఎన్నికల



ప్రచారంలో భాగంగా నంద్యాల పట్టణంలోని 7,8,10,11 వార్డులలో వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థులైన చిల్లు భాయ్ ఏజాజ్ హుస్సేన్, షేక్ అబ్దుల్ మజీద్, దండే సుధాకర్, షేక్ అబ్దుల్ కలాం బాషా, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి అమీర్ బాష (దాల్మిల్ అమీర్)తో కలిసి శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా విస్తృత ప్రచారం నిర్వహించారు. వైసీపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

వైసీపీ అభ్యర్థుల కోసం వార్డులో ఉన్న సీనియర్ వైసీపీ నాయకులందరూ కలిసి గట్టుగా అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తున్న వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, హామీల ఉల్లంఘనలను ఎండగట్టారు. మున్సిపాలిటీలో 52 వార్డులకు 52 పోటీ చేస్తున్నామని నంద్యాలలో వైసిపి జెండా ఎగరవేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు శిల్పా రవి రెడ్డి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేద ప్రజలను, మహిళలను నిలువునా మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదలకు 2 సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తామని చెప్పి మాట తప్పిన కూటమి నాయకులు, అబద్ధాల కరపత్రాలతో ప్రజలను మళ్లీ మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు.

"ఎన్నికలు రాగానే కూటమి నాయకులకు మళ్లీ జనం గుర్తుకొస్తారని , నంద్యాలలో 25 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేశామంటూ విచ్చలవిడిగా కరపత్రాలు ముద్రించి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన 2 సెంట్ల స్థలం హామీ ఏమైంది? పేదల నడ్డి విరిచి గద్దెనెక్కిన ఈ ప్రభుత్వానికి ఓటుతోనే ప్రజలు బుద్ధి చెప్పాలని శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పిలుపు నిచ్చారు".

ఎన్నికల సమయంలో నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు మోసపూరిత హామీలు ఇచ్చారని శిల్పా రవి మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీలను గాలికి వదిలేసి ప్రజలపై తీవ్ర భారం మోపారని ఆరోపించారు.

పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేస్తామని నమ్మించి మహిళలను దారుణంగా మోసం చేశారని శిల్పా రవిరెడ్డి విమర్శించారు.

"నీకు 15.. నీకు 15.. నీకు 15": మహిళలకు రూ. 15 వేల నగదు పథకం అందిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.

50 ఏళ్ల లోపు మహిళలకు ఏడాదికి రూ. 18 వేలు ఇస్తామన్న ప్రకటనలు ఏమయ్యాయని నిలదీశారు.

గత మూడేళ్లుగా 'సూపర్ సిక్స్' పథకాలను అమలు చేస్తామని కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న కూటమి అభ్యర్థులను ఓటు అనే ఆయుధంతో ఓడించి ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే నంద్యాల పట్టణ రూపురేఖలు మారాయని శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి స్పష్టం చేశారు.

పట్టణంలో 8 నూతన పార్కుల నిర్మాణం, అర్బన్ హెల్త్ సెంటర్లు, మిల్క్ సెంటర్లు అందుబాటులోకి తెచ్చామన్నారు.

నాడు–నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశామని తెలిపారు.

దశాబ్దాలుగా నంద్యాల ప్రజలను వేధిస్తున్న తాగునీటి సమస్యను 'అమృత్' పథకం ద్వారా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని ఆయన గర్వంగా ప్రకటించారు.

అభివృద్ధికి పట్టంకట్టిన వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచి, ప్రజా వ్యతిరేక కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

# కర్నూలు 56వ వార్డులో బహుజన్ సమాజ్ పార్టీ ఎన్నికల ప్రచారం ప్రారంభం

**● తొలిసారిగా నా కుటుంబం తరపున ఓటు అడుగుతున్నా: జిల్లా ఇంచార్జి గాడి అరుణ్ కుమార్ ● ఏనుగు గుర్తుకు ఓటేసి కార్పొరేటర్, మేయర్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు నగర పాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో భాగంగా



56వ వార్డు పరిధిలోని లేబర్ కాలనీ, పాల కొట్టాలు ప్రాంతాల్లో బహుజన్ సమాజ్ పార్టీ (దీప్రా) ఎన్నికల ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది. ఈ వార్డు బీఎస్పీ కార్పొరేటర్ అభ్యర్థి దాదేపోగు రామాంజనేయులు తరపున కర్నూలు జిల్లా ఇంచార్జి గాడి అరుణ్ కుమార్ పార్టీ శ్రేణులతో కలిసి విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఓటర్లనుద్దేశించి గాడి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. "గతంలో ఎన్నో ఎన్నికలు జరిగినప్పటికీ వ్యక్తిగతంగా ఎప్పుడూ నా కోసం ఓటు అడగలేదని, తొలిసారిగా నా కుటుంబం తరపున ప్రజల ముందుకు వచ్చి ఓటు అడుగుతున్నానని" భావోద్వేగంతో విజ్ఞప్తి చేశారు. వార్డు ప్రజల ఆదరాభిమానాలు, ఆశీస్సులే తమకు కొండంత బలమని ఆయన పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్‌లోని క్రమ సంఖ్య 2 వద్ద ఉన్న బీఎస్పీ ఎన్నికల చిహ్నం 'ఏనుగు గుర్తు' పై ఓటు వేసి, కార్పొరేటర్ అభ్యర్థి దాదేపోగు రామాంజనేయులు, మేయర్ అభ్యర్థి అమడగుంట్ల శాంతిలను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన వార్డు ప్రజలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో అభ్యర్థి డి. రామాంజనేయులు, నాయకులు ఆర్. ప్రసాద్, పి. రవి ప్రసాద్, టి. రాజశేఖర్, కె. నల్లన్నలతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, వార్డు పెద్దలు పాల్గొన్నారు.

## అవినీతి నిర్మూలనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి.

### యువత, విద్యావంతులు కీలక పాత్ర పోషించాలి.

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. అవినీతి రహిత సమాజ నిర్మాణం ప్రతి పౌరుడి బాధ్యత అని, సమాజాభివృద్ధికి అడ్డంకిగా ఉన్న అవినీతి నిర్మూలనలో యువత, విద్యావంతులు చురుకైన పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అవినీతి నిరోధక 1064 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో అవినీతి నిరోధక చైతన్యం పెంపొందించి, పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈనెల 26 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన






కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టర్ల ప్రదర్శన, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీలు, విజిలెన్స్ అధికారులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 30న టోల్‌ఫ్రీ నంబర్ 1064పై ఎఫ్‌ఎం రేడియో ద్వారా ప్రచారం చేపట్టి, అక్టోబర్ 31న మండల కేంద్రాల్లో ప్రజలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమన్వయ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ సీఐ రామాంజనేయులు, ఎస్ఐ సుబ్బరాయుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

## కల్లూరు అర్బన్‌లో వైఎస్సార్‌సీపీ ముమ్మర ప్రచారం

### -37, 38, 39వ వార్డుల్లో కాటసాని రాంభూపాల్ రెడ్డి పాదయాత్ర

### -ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అభ్యర్థులను గెలిపించాలని పిలుపు

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో  మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్లూరు అర్బన్ పరిధిలోని 37, 38, 39వ వార్డుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముమ్మర ప్రచారం నిర్వహించాయి. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని



రాంభూపాల్ రెడ్డి ఆయా వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేపట్టారు. ?ఈ సందర్భంగా కర్నూలు నగర మేయర్ అభ్యర్థి సుశీలమ్మతో పాటు 37వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి హేమలత, 38వ వార్డు అభ్యర్థి ఎద్దుల ప్రవళిక, 39వ వార్డు అభ్యర్థి చిట్టిబాబులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆదరించి ఫ్యాన్ గుర్తుపై అమూల్యమైన ఓట్లు వేయాలని అభ్యర్థించారు.

?ప్రచారంలో భాగంగా కాటసాని నేరుగా స్థానిక ప్రజలతో మమేకమై వార్డుల్లోని సమస్యలు, మౌలిక వసతులు, అభివృద్ధి అంశాలపై ఆరా తీశారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వార్డులను అభివృద్ధి పథంలో నడిపించే సత్తా తమ అభ్యర్థులకే ఉందని స్పష్టం చేశారు. ?ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక డివిజన్ల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థులకు ఘన స్వాగతం పలికారు.

## వైసీపీకి గట్టి షాక్.. గుడికల్‌లో టీడీపీలోకి భారీగా చేరికలు,,,,,



ఎమ్మిగనూరు పల్లె వెలుగు అక్టోబర్ 26 ఎమ్మిగనూరు మండలంలో గుడికల్ గ్రామంలో వైసీపీ నుండి టిడిపిలో చేరిన గుడికల్ గ్రామస్తులు వైసీపీ వైఫల్యాలు, గత పాలనపై అసంతృప్తి, కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆకర్షితులై గుడికల్ గ్రామానికి చెందిన సుమారు 200 మంది మహిళలు, యువత తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర్ రెడ్డి  సమక్షంలో పార్టీలో చేరిన వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు తమ పూర్తి మద్దతు ప్రకటించి, భారీ మెజారిటీతో విజయం సాధించేలా కృషి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. గుడికల్‌లో పెరుగుతున్న టీడీపీ బలం.. రాబోయే ఎన్నికల్లో విజయానికి సంకేతం! ప్రజల నమ్మకమే మన బలం, అభివృద్ధే మన లక్ష్యం అని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, టీడీపీ మండల అధ్యక్షులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

**-కల్లూరు అర్బన్ 42, 45 వార్డుల్లో ముమ్మర ఎన్నికల ప్రచారం**

**టీడీపీలోకి వైసీపీ కుటుంబాల చేరిక**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో  కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్నికల హామీలను నెరవేరుస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్లూరు అర్బన్ పరిధిలోని 42, 45 వార్డుల్లో ఆమె విస్తృతంగా పర్యటించారు.

ఈ సందర్భంగా వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ, తెలుగుదేశం పార్టీ మేయర్ అభ్యర్థి బొల్లేదుల విజయ ప్రత్యూషతో పాటు 42వ వార్డు అభ్యర్థి డి. మహేశ్వరమ్మ, 45వ వార్డు అభ్యర్థి కె. మహాలక్ష్మిలను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సైకిల్ గుర్తుపై రెండు ఓట్లను వేసి అభ్యర్థులకు ప్రజాసేవ చేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో తమ కుటుంబానికి అండగా నిలిచినట్లే, ప్రస్తుతం పోటీలో ఉన్న అభ్యర్థులను కూడా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని ఆమె తెలిపారు.

టీడీపీలోకి భారీ చేరికలు:

ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా 42వ వార్డుకు చెందిన పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే స్వయంగా పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో 42వ వార్డు నాయకులు మధుసూదన్ రెడ్డి, టైలర్ నాగరాజు, ఖాజా బందే నవాజ్, శేఖర్, తలారి కృష్ణ, మురళి గౌడ్, నరసింహులు, గోల్డ్ ఇబ్రహీం, గిరి, మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ ఎన్వీ రామకృష్ణతో పాటు 45వ వార్డు నాయకులు రవి ప్రకాశ్ రెడ్డి, రాములమ్మ, రామారావు, జంగాల సుంకన్న, ఎల్లప్ప, బుల్లెట్ సుంకన్న తదితర కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో శాస్త్రీయ విప్లవానికి హరిత ఫౌండేషన్ శ్రీకారం - బండి పరిమళ జ్యోతి

కాశినాయన, అక్టోబర్ 26 ( పల్లె వెలుగు ):విద్యా



ప్రదాత ,మార్గదర్శి , దార్శనికుడు ముఖ్యవక్త ,ప్రముఖ సంఘ సేవకులు అమెరికాలో నివాసం ఉంటున్న డాక్టర్ ఫణి రాజకుమార్ స్థాపించిన హరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో హరిత ఫౌండేషన్ కోఆర్డినేటర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండి పరిమళ జ్యోతి గ్రామీణ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించాలని లక్ష్యంతో యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం- రోబోటిక్స్ కార్యక్రమంను కాసినాయన మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నర్సాపురంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆమ్నిస్టిక్స్ లాబ్స్- సీఈవో ఉదయ్ చైతన్య విద్యార్థులకు రోబోటిక్స్ కి సంబంధించిన అంశాలను వివరించి, రోబోట్ల సహాయంతో విద్యార్థులు ప్రత్యక్షంగా పాల్గొంటూ రోబోటిక్స్ పనితీరును తెలుసుకున్నారు. ఈ విధమైన ప్రయోగాత్మక అభ్యసనం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, తార్కిక ఆలోచన, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలు పెంపొందుతాయని వివరించారు. ఎలక్ట్రానిక్ కంటెంట్, ఆధునిక బోధనా పద్ధతు ల సహాయంతో విద్యార్థు లు సులభంగా ,ఆసక్తికరంగా నేర్చుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. సైన్సును కేవలం పుస్తకాల ద్వారా కాకుండా, ప్రత్యక్ష అనుభవాల ద్వారా నేర్చుకోవడానికి ఈ కార్యక్రమం దోహద పడింది. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు నాటిన మొక్కలను విద్యార్థులు దత్తత తీసుకొని వాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడంతో పాటు ప్రకృతిని కాపాడుకోవడం కూడా ప్రతి విద్యార్థి బాధ్యత అనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కాశి నాయన మండలం విద్యాశాఖ అధికారులు మహమ్మద్ షఫీ, నిర్మల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం సుబ్బారెడ్డి , ఉపాధ్యాయులు కృషి చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉందని హరిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పనిరాజకుమార్ గారికి, హరిత ఫౌండేషన్ బృందానికి ఉపాధ్యాయులు, ఎంఈఓ లు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## నంద్యాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు.

**వాల్మీకి మహర్షి రచించిన "రామాయణం మహాకావ్యం" సమస్త మానవాళికి ఆదర్శం.**

**జిల్లా పోలీస్ కార్యాలయంలో శ్రీ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించిన జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్.**

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో నేడు శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ శ్రీ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు.

అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎందరో మహానుభావులు జన్మించిన పుణ్యభూమి భారతదేశం. ఈ తరం వారు వాల్మీకి మహర్షి లాంటి మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం ద్వారా స్ఫూర్తి పొంది వారి మార్గంలో పయనించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా సాధించగలుగుతారు. అలాంటి ఓ మహనీయుడు వాల్మీకి మహర్షి అని నేడు ఆయన జయంతిని మనం జరుపుకుంటున్నాము.




వాల్మీకి మహర్షి గొప్ప మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే రామాయణం లాంటి మహాకావ్యాన్ని రచించి, సమాజానికి అందించిన వాల్మీకి మహర్షి చూపిన దారిలో మనందరం నడవాలని, నేడు ఆయన జయంతి సందర్భంగా మనమందరం వాల్మీకి మహర్షిని స్మరించుకొంటూ అందరికి ఆదర్శంగా నిలవాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్. ఖాదర్ బాష , ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ చిన్నికృష్ణ , ఏ ఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు , డిపిఓ ఏవో వీరన్న , ఆర్ ఐ లు బాబు, సురేష్, ఏ ఆర్ ఎస్ ఐ హర్షవర్ధన్ రెడ్డి, డి పి ఓ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకోవాలి

**● నేడు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఫెసిలిటేషన్ సెంటర్ ● దామోదరం సంజీవయ్య మెమోరియల్ పాఠశాలలో కేంద్రం ఏర్పాటు ● పోలింగ్ సిబ్బంది, పోలీసు సిబ్బందికి ఓటు వేసే అవకాశం ● అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు**

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :  స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కర్నూలు నగరపాలక సంస్థ ఓటరు జాబితాలో పేరుండి, కర్నూలుతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, పోలీసు సిబ్బంది కోసం మంగళవారం ఏర్పాటు చేస్తున్న ఫెసిలిటేషన్ సెంటర్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. సోమవారం నగరంలోని పాత కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న దామోదరం సంజీవయ్య మెమోరియల్ పాఠశాలలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాట్లను పరిశీలించిన ఆయన, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్



మాట్లాడుతూ.. కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల ఓటరు జాబితాలో పేరుండి, ఎన్నికల విధులు నిర్వహించే అర్హులైన పోలింగ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. దామోదరం సంజీవయ్య మెమోరియల్ మున్సిపల్ పాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రానికి వచ్చే సిబ్బంది కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల ఓటరు జాబితాలో తమ పేరుకు సంబంధించిన వివరాలు, ఎన్నికల విధులు కేటాయించినట్లు సంబంధిత అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. కేంద్రంలో గెజిటెడ్ అధికారుల ద్వారా అవసరమైన ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేసి, అర్హులైన సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్లు వివరించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత సమయంలో ఫెసిలిటేషన్ సెంటర్‌కు చేరుకుని, అవసరమైన పత్రాలతో ప్రక్రియను పూర్తి చేసుకోవాలని చల్లా ఓబులేసు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, డీఈఈ కృష్ణలత, టీపీఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు సిద్ధమంటూ సంకేతాలు!

బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 26: వివిధ పార్టీలకు సంబంధించిన నామినేషన్ల ఉప సంహరణ ఒకరోజు గడువు ఉండగానే ఎన్నికలకు పార్టీలు సిద్ధమవుతున్నాయని సంకేతాలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల నుండి చర్చలు... మాకు ఎన్ని.. మీకు ఎన్ని..అంటూ వెలువడుతున్న ఊహాగానాలకు తెరపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి.



బండి ఆత్మకూరు మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, అన్ని స్థానాలకు అధికార తెలుగుదేశం పార్టీతోపాటు, వైయస్సార్ పార్టీ, సిపిఎం, సిపిఐ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు అన్ని పార్టీల నాయకులు మొదట్లో ఉత్సాహం చూపినప్పటికీ, ఈ విషయంలో చర్చలు జరుగుతున్నాయి, ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేసుకునే ప్రయత్నాలు కూడా పెద్ద నాయకులు చేస్తున్నారన్న సంకేతాలతో, రెండు పార్టీలకు చెందిన అభ్యర్థులు మౌనంగా ఉన్నారు. ఈ విషయంపై సోమవారం నాడు జరిగిన చర్చలు విఫలం కావడంతో, ఇక పోటీకి సిద్ధమని సంకేతాలు వెలువడ్డాయి. ఉపసంహరణకు ఒక రోజు గడువు ఉండగానే వైఎస్ఆర్ పార్టీకి చెందిన ఎంపీటీసీ అభ్యర్థులందరూ బీఫారంలను ఎన్నికల అధికారులకు సమర్పించడంతో రాజకీయ వాతావరణం వేడెక్కుతూ ఉంది. మరికొందరు అభ్యర్థులు బీఫారములను సిద్ధం చేసుకుని మంగళవారం నాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించే ప్రయత్నాలు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలో భాగంగా, మండలంలో బి.కోడూరు గ్రామానికి జనసేన అభ్యర్థిని, కడమల కాల్వ గ్రామానికి ఎంపిటిసి అభ్యర్థిగా బిజెపి పార్టీకి చెందిన వారిని కూటమి ప్రభుత్వం కేటాయించింది. అయితే ఈ నిర్ణయాన్ని అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు జీర్ణించిపోలేకపోయారు. బి.కోడూరు గ్రామంలో ఎంపీటీసీ అభ్యర్థి జనసేన పార్టీకి కేటాయించిన నేపథంలో, మొదట్లో ఆ గ్రామంలో అధికార పార్టీ నాయకుల నుండి నిరసనల సెగ జనసేన పార్టీ అభ్యర్థికి తగిలింది. జనసేన పార్టీ అభ్యర్థి ఎన్నికల్లో పోటీ చేస్తే, మద్దతు తెలుపకుండా శల్య సారథ్యం వహించే కుటిల ప్రయత్నాలు జరుగుతున్నాయి అన్న పుకార్లు షికార్లు చేస్తున్నాయి.



ఓటర్లలో సంబరం

ఇన్నాళ్లు ఎన్నికలు ఏకగ్రీవం చేసుకుంటున్నారు అన్న వార్తలతో నిరుత్సాహానికి గురైన ఓటర్లు, ప్రస్తుతం ఎన్నికలు జరుగుతాయని సంకేతాలు వస్తూ ఉండటంతో సంబర పడుతున్నారు. ఏకగ్రీవాల కారణంగా తాము ఓటు వేసే హక్కును కోల్పోతున్నామని, ఈ కారణంగా రాజ్యాంగం ప్రసాదించిన, భవిష్యత్తును ప్రశ్నించే హక్కును కూడా కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన పడ్డారు. ప్రస్తుతం ఎన్నికలు జరిగితే తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అడ్డంకులు ఉండవని ఓటర్లు అభిప్రాయపడుతున్నారు.

# ఓట్ల లెక్కింపుపై పూర్తి అవగాహన ఉండాలి

**● అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు ● సూపర్వైజర్లు, సహాయకులకు ఓట్ల లెక్కింపు ప్రక్రియపై శిక్షణ ● రెండు అంతస్తుల్లో 145 కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు ● మొత్తం 820 మంది కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ**

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓట్ల లెక్కింపుపై పూర్తి అవగాహనతో ఉండాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. సోమవారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్) నందు ఓట్ల లెక్కింపు విధులు నిర్వహించే సూపర్వైజర్లు, సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు విధానంపై ప్రాయోగిక ప్రదర్శనతో అవగాహన, బ్యాలెట్ పత్రాల విభజన, ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సిబ్బంది విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం రెండు అంతస్తుల్లో మొత్తం 145 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో కార్పొరేటర్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు కోసం 72 టేబుళ్లు, మేయర్ అభ్యర్థి ఓట్ల లెక్కింపు కోసం 73 టేబుళ్లను కేటాయించినట్లు వివరించారు. ప్రతి కౌంటింగ్ టేబుల్‌కు ఒక సూపర్వైజర్‌తో పాటు నలుగురు సహాయకులను నియమించినట్లు తెలిపారు.



అదనంగా 10 శాతం సిబ్బందిని రిజర్వులో ఉంచినట్లు పేర్కొన్నారు. మొత్తం 820 మంది సిబ్బందికి ఓట్ల లెక్కింపు ప్రక్రియపై శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. బ్యాలెట్ పత్రాల్లో మేయర్ అభ్యర్థులకు సంబంధించినవి పింక్ రంగులో, కార్పొరేటర్ అభ్యర్థులకు సంబంధించినవి తెలుపు రంగులో ఉంటాయని తెలిపారు. బ్యాలెట్ పత్రాలు కలిపి ఉంటాయని, తొలుత వాటిని మేయర్, కార్పొరేటర్ అభ్యర్థుల పత్రాలను వేర్వేరుగా విభజించాల్సి ఉంటుందన్నారు. అనంతరం బ్యాలెట్ పత్రాలను 25 పత్రాల చొప్పున కట్టలుగా కట్టి, ప్రతి రౌండ్‌లో 1,000 బ్యాలెట్ పత్రాలను లెక్కించే విధానంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. మేయర్, కార్పొరేటర్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు కోసం ఎదురెదురుగా టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఓట్ల లెక్కింపు సమయంలో ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, బ్యాలెట్ పత్రాల విభజన నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల నమోదు వరకు ప్రతి దశలో అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, కచ్చితత్వంతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జునైద్, కార్యదర్శి నాగరాజు, సూపరింటెండెంట్ ఇశ్రాయేలు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

# కౌంటింగ్ కేంద్రం చురుగ్గా ఏర్పాట్లు

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు



నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణలో భాగంగా కౌంటింగ్ కేంద్రం వద్ద చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. సోమవారం నగర శివార్లలోని అథెనా స్కూల్ ప్రాంగణంలో అధికారులతో కలిసి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. అథెనా స్కూల్ మైదానంలో పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం (రిసెప్షన్ సెంటర్), స్పోర్ట్స్ బిల్డింగ్ (ఇండోర్ స్టేడియం)లో స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేస్తున్నామని, ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ సమయంలో రాకపోకలకు అంతరాయం కలగకుండా కొత్తగా మరో రహదారిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లో బ్యాలెట్ బాక్సుల భద్రతకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నామని, భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేలా సిసి కెమెరాలు, పోలీస్ బందోబస్తు ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు గదుల్లో అవసరమైన సదుపాయాలు, అధికారుల విధుల నిర్వహణకు అనుకూలమైన ఏర్పాట్లు దాదాపు పూర్తి అయ్యాయన్నారు. కౌంటింగ్ కేంద్రం సమీపంలో పార్కింగ్ ప్రదేశాలకు ప్రత్యేక స్థలాలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తామని చల్లా ఓబులేసు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈలు నరేష్, పవన్ కుమార్ రెడ్డి, ఏఈలు జనార్ధన్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం






మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ లో 2026–2027 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అనుమతి లభించిందని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వివిధ కారణాలతో చదువును మధ్యలో ఆపేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునేవారు ఈనెల 31 లోపు ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలన్నారు. ఓపెన్ టెన్త్ 100 సీట్లు, ఇంటర్మీడియట్ 40 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు విద్యార్హత ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో పాఠశాలను సంప్రదించాలన్నారు.

# అబ్బీపురంలో వాల్మీకి జయంతి వేడుకలు

మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం అబ్బీపురం గ్రామంలో వాల్మీకి జయంతి



వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకి నాయకులు తలారి మధు, రామయ్య మాట్లాడుతూ.. మహర్షి వాల్మీకి మనకు అందించిన రామాయణం కేవలం ఒక ఇతిహాసం మాత్రమే కాదన్నారు. మనిషి ఎలా జీవించాలి, ధర్మమార్గంలో ఎలా నడవాలి, కుటుంబ విలువలను ఎలా కాపాడుకోవాలి అనే విషయాలను తెలియజేసే గొప్ప మార్గదర్శి అన్నారు. వాల్మీకి మహర్షి జీవితం మన అందరికి స్ఫూర్తి అన్నారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు మద్దిలేటి, నాగయ్య, హనుమన్న పాల్గొన్నారు.

# అనకాపల్లికి బేతంచెర్ల విద్యుత్ సిబ్బంది

బేతంచెర్ల, పల్లెవెలుగుఅక్టోబర్ 26: అరబ్ తుపాను నేపథ్యంలో అనకాపల్లి ప్రాంతంలో విద్యుత్ సేవలు అందించేందుకు బేతంచెర్ల విద్యుత్ శాఖ సిబ్బంది బయలుదేరారు. ఏఈ



(రూరల్) పి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో బృందం అనకాపల్లికి పయనమైంది. ఈ బృందాన్ని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పచ్చజెండా ఊపి లాంఛనంగా సాగనంపారు. ఈ బృందంలో లైన్ మెన్లు రామచంద్రుడు, నాగరాజశేఖర్, సుంకన్న, రామన్నతో పాటు పలువురు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే తక్షణమే మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించేందుకు సిబ్బంది సేవలు అందించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ శాఖ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నారని అధికారులు తెలిపారు.

# ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

బనగానపల్లె, అక్టోబర్ 26, పల్లెవెలుగు పట్టణంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వాల్మీకి మహర్షి విగ్రహానికి వాల్మీకి సంఘం నాయకులు గౌండా వెంకటసుబ్బయ్య, బంగారు అంగడి నాగరాజు ల ఆధ్వర్యంలో వాల్మీకి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు .వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు టీ .మాధవరెడ్డి, టి.ఆర్. జగన్నాథ రెడ్డి వాల్మీకి సంఘం నాయకులు నాగ భూపతి శ్రీహరి, నవీన్, నాగేశ్వరి, లక్ష్మేశ్వరి, బోయ సురేష్ పెద్ద రాజుపాలెం వెంకటేశ్వర్లు పసుపల శ్రీనివాసులు ,వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు



## వైభవంగా వాల్మీకి మహర్షి జయంతి ఊరేగింపు





హోళగుంద పల్లె వెలుగు అక్టోబర్ : 26 మండల పరిధిలోని గజ్జహల్లి గ్రామంలో శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని అలంకరించి, గ్రామ పురవీధుల గుండా అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో భాగంగా కోలాటాలు ఆడుతూ, భజనలు చేస్తూ, డొల్లుల వాయిద్యాల నడుమ సంప్రదాయబద్ధంగా ఉత్సవాలను నిర్వహించారు. డొల్లుల మోతలు, భజనలతో గ్రామ వీధులు సందడిగా మారాయి. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఐకమత్యంతో పాల్గొని వాల్మీకి మహర్షికి ఘనంగా నివాళు లర్పించారు.

## వైభవంగా ఉమామహేశ్వరుల పల్లకి సేవ మహోత్సవం

బనగానపల్లె , అక్టోబర్ 26, పల్లెవెలుగు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి



శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవం వైభవంగా జరిగింది సోమవారం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో ఉమామహేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ప్రదోషకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను పల్లకి లో ఊరేగింపు నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఆలయ కార్యనిర్వణ అధికారి పాండురంగారెడ్డి , ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వరరెడ్డి ,పాతపాడు మాజీ సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి , సభ్యులు తిరుమలయ్య, భరతుడు, జె.సురేష్, మహేష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, భక్తులు, అర్చకులు, ,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని

**పి. భావనారెడ్డికి ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుల అభినందనలు**

బనగానపల్లె, అక్టోబర్ 26,పల్లెవెలుగు నంద్యాల జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (రా+ఖీ) ఆధ్వర్యంలో 2026 అక్టోబర్ 24న డోన్‌లోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీల్లో ఏపీ మోడల్ స్కూల్, రవ్వలకొండ, బనగానపల్లె, నంద్యాల జిల్లా విద్యార్థిని పి. భావనారెడ్డి (ఖ–17 బాలికల విభాగం) అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి జ.ఎ. రామలక్ష్మి విద్యార్థినిని అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, నంద్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు షేక్ సిరాజున్ మార్గదర్శకత్వంలో విద్యార్థిని సాధించిన ఈ విజయం పట్ల పాఠశాల సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు పాఠశాల అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పి. భావనారెడ్డికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, సిబ్బంది హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. విద్యార్థిని విజయం పాఠశాలకు గర్వకారణం!



## ఎంపీపీ ఉర్దూ పాఠశాలను డీఈవో పరిశీలన

బనగానపల్లె, అక్టోబర్ 26, పల్లెవెలుగు పట్టణంలోని మండల పరిషత్ ఉర్దూ బాలికల పాఠశాలను డీఈవో జనార్దన్ రెడ్డి సోమవారం పరిశీలించారు. పాఠశాల తరగతి గదులు, విద్యార్థుల హాజరు, పాఠ్యప్రణాళిక అమలు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, వారి అభ్యసన పరిస్థితి, బోధనా నాణ్యత, విద్యా ప్రమాణాల గురించి తెలుసుకున్నారు. పాఠశాల వసతులు, బోధన, విద్యార్థుల ప్రగతిపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాలలో విద్యా నాణ్యతను మరింత మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి విద్యార్థి అభ్యసనపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. విద్యార్థుల లకు అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలిగితేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ స్వరూప, ప్రధానోపాధ్యాయులు నూర్ మొహిద్దిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ఎన్నికల బాత్ కహానీ

నారప్పకు నాలుగు రోజుల నుండి మందు లేక నాలుక పిడచ కట్టుకొని పోతావుంది. ఎంపిటిసి ,జడ్పిటిసి ఎన్నికలకు నామినేషన్లు వేసి నాలుగు రోజులవుతుంది. ఏ నాయకుడు చుక్క మందు పోయడం లేదు. అధికార అభ్యర్థి గాని, ప్రతిపక్ష అభ్యర్థిగాని పలకరించే దిక్కు లేకుండా పోతా ఉంది. ఏం చేయాలబ్బా! అంటూ నారప్ప బుర్ర బద్దలు కొట్టుకుంటున్నాడు. జెడ్పిటిసి స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికలలో నామినేషన్ వేసిన వెంకటప్ప గుర్తుకు వచ్చాడు. అక్కడికైనా వెళితే కాస్త మందు అయినా దొరుకుతుంది అన్న ఆశతో అక్కడికి వెళ్ళాడు. అప్పటికే వెంకటప్ప సీసా పెట్టుకుని ఎన్నికల ఊహల్లో ఊరేగుతూ మందు తాగుతూ కూర్చున్నాడు. వెంకటప్ప మందు తాగుతున్న విషయాన్ని చూసి, నారప్ప నోట్లో ఒల్య బట్ట నోట్లో నములుకుంటూ వెంకటప్ప వైపు ఆశగా చూస్తూ నిలుచున్నాడు. ఇది గమనించిన వెంకటప్ప , ఏంట్రా.. బయట ఏమి ఉండావు.. లోపలికి రా అంటూ నారప్పని పిలిచాడు. అప్పటికే మందు లేక తణుకులాడుతున్న నారప్ప వెంటనే వెంకటప్ప కాళ్ల దగ్గర కూ లబడ్డాడు.

**వెంకటప్ప: ఏంట్రా సంగతులు.. ఊర్లో ఏమనుకుంటున్నారు?**

**నారప్ప: అంతా నీ గురించే అనుకుంటున్నారయ్యా .. నామినేషన్ వేశారంట కదా! మీరే గెలుస్తారని ఊర్లో అంతా అనుకుంటా ఉండారు.**

**వెంకటప్ప: ఏంటి రోయ్! కాక పడుతున్నావా .. ఆ...**

నారప్ప: అదేమీ లేదయ్యా! అధికారం, ప్రతిపక్ష సభ్యులకు ఎన్నికలలో ఖర్చు పెట్టడానికి డబ్బు లేదని, ఎరువుల దుకాణం మీకు ఉంది కాబట్టి గ్రామాలలో కాస్త కూస్తో పలుకుబడి మీకే ఉందని ఊర్లో అంతా అనుకుంటా ఉండారు.

వెంకటప్ప: ఎల్నినో పరిస్థితి వల్ల వ్యాపారం అంతంత మాత్రమే ఉంది. ఆర్థిక పరిస్థితి కూడా బాగాలేదు, ఏదో కొండకు వెంట్రుక వేసినట్టు, నామినేషన్ వేసాం.., ఎవడో ఒకడు రాజీకి కానీ రాకపోతాడా! ఖర్చులకు



ఇవ్వకపోతారా!అనుకుంటా ఉంటే, వీడేంటి? అంతా నా గురించి అనుకుంటూ ఉండారు అంటూ వెంకటప్ప మనసులోనే గొణుక్కుంటున్నాడు. ఇంతలోనే ఎరువుల అంగడి గుమస్తా నుండి వెంకటప్ప కు ఫోన్ వచ్చింది. అయ్యా! షాపు వద్దకు పోలీసులు, విజిలెన్స్ అధికారులు దాడికి వచ్చారు, అంటూ కబురందించాడు. దీంతో వెంకటప్ప కు తాగినదంతా దిగిపోయింది. ఇదంతా అధికార పక్షం వాళ్లు చేయించారని వెంకటప్ప గుర్తించాడు. ఎన్నికల బరి నుండి తనను తప్పించేందుకు వాళ్లే పోలీసులను రప్పించి ఉంటారని ఊహించాడు. ఎందుకొచ్చిన గొడవ.. నామినేషన్ విత్ డ్రా చేసుకోవాలని వెంకటప్ప ఎరువుల దుకాణం వద్దకు వెళ్లే పనిలో పడ్డాడు.

నారప్ప: ఇంతసేపు యవ్వారం చేస్తున్నా , చుక్క మందు కూడా పోయడం లేదు ఏమిటి? అంటూ నీళ్లు నములుకుంటూనే, అయ్యా! కాస్త మందు అంటూ నసిగాడు.

వెంకటప్ప: తూ నీ యవ్వ! పోలీసోళ్ళు షాపు దగ్గరికి వచ్చి నన్ను రమ్మంటుంటే.. మందంటూ నీ గొడవ ఏమిట్రా? మందు లేదు ,నీ బొంద లేదు.. వెళ్ళు ఇక్కడి నుంచి అంటూ హుంకరించాడు. ఖర్చుల మాట దేవుడు ఎరుగు.. నామినేషన్ విత్ డ్రా చేసుకుంటే, కాస్త వ్యాపారమైన చేసుకోవచ్చు! విత్ డ్రా చేసుకుంటేనే బాగుంటుందన్న ఉద్దేశంతో షాపు వైపు పరిగెత్తాడు. ఇంతసేపు యవ్వారం చేసినా, ఓ సీసా నా మొహాన పడేయలేదు అంటూ, నారప్ప గొణుక్కుంటూ ఇంటిదారి పట్టాడు.

**గమనిక**

**పాఠకులు చదువుకోవడానికి సరదాగా అల్లిన కట్టుకథ**

**రసూల్ పల్లె వెలుగు జర్నలిస్టు**

**బండి ఆత్మకూరు**

### కూటమి మోసాలను ఎదిరిద్దాం..

# నంద్యాలలో ఫ్యాన్ జెండా ఎగరేద్దాం.

**-కూటమి ప్రభుత్వంపైమాజీ ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి నిప్పులు చెరిగారు.**

పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల పట్టణంలో సుపరిపాలన, సమగ్రాభివృద్ధి మళ్లీ సాధ్యం కావాలంటే వైఎస్సార్సీపీనే ఏకైక శరణ్యమని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన దగాకోరు కూటమి ప్రభుత్వానికి నవంబర్ 1న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని ఆయన ఉద్వేగభరితంగా పిలుపునిచ్చారు.

నంద్యాల పట్టణంలోని 25, 28, 29, 31 వార్డులలో హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారంలో శిల్పా రవిరెడ్డి కదిలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి తీవ్ర ఆవేశంతో ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థులు శ్వేత, కామిని రాజశేఖర్ రెడ్డి, యల్లంపల్లి శివశంకర్ రెడ్డి, గంగా చరణ్ రెడ్డి మరియు చైర్మన్ అభ్యర్థి అమీర్ బాష (దాల్మిల్ అమీర్) లను ఫ్యాన్ గుర్తుపై భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారులి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష తదితరులు పాల్గొన్నారు.

కూటమి సర్కార్ పై శిల్పా రవిరెడ్డి విరుచుకుపడ్డారు.

మోసపూరిత వాగ్దానాలు: ఎన్నికల సమయంలో 'సూపర్ సిక్స్' అంటూ ఆకాశమే హద్దుగా హామీలిచ్చి ఓట్లు దండుకున్న కూటమి నాయకులు, నేడు అధికారంలోకి వచ్చాక ప్రజలను నట్టేట ముంచారని, నంద్యాల ప్రజలను మోసంతో దగా చేశారని మండిపడ్డారు.

ప్రశ్నిస్తే కక్షసాధింపులేనా?: ప్రజలు తాము ఇచ్చిన హామీలను, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని నిలదీస్తే వారిపైనే ఎదురుదాడి చేస్తున్న ఈ మోసపూరిత నేతల మాటలను ఇకపై నమ్మవద్దని ఆయన హెచ్చరించారు.

గత పాలనే మనకు రక్ష: వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో గడపగడపకు వెళ్లి ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించామని, నంద్యాల నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి ఫలాలను అందించామని గుర్తుచేశారు. నేడు టీడీపీ నాయకులు 'ఇంటింటికి తెలుగుదేశం' అంటూ







వస్తున్నారని, ఓట్లు అడిగేసి వెళ్లిన వీరు ఎప్పుడైనా మీ సమస్యల కోసం మీ ఇంటి ముంగిటికి వచ్చారా అని సూటిగా నిలదీశారు.

నంద్యాల గడ్డపై ఫ్యాన్ జెండా ఎగరడం ఖాయం!

శిల్పా సేవా సమితి ద్వారా తాము చేపడుతున్న నిరంతర ప్రజా సేవలను సైతం రాజకీయ కక్షలతో అడ్డుకోవాలని చూసిన కుట్రలను ప్రజలు గమనించాలని శిల్పా రవిరెడ్డి హితవు పలికారు. నంద్యాల భవిష్యత్తును, సంక్షేమాన్ని కాంక్షించే ప్రతి ఒక్క ఓటరు నవంబర్ 1వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి, అఖండ విజయంతో రికార్డు సృష్టించాలని ఆయన తీవ్ర భావోద్వేగంతో కోరారు.

## నేడే శ్రీ యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానం నందు కొబ్బరి చిప్పలు, తలనీలాలు పోగు చేసుకొను హక్కు వేలం

బనగానపల్లె, అక్టోబర్ 26,పల్లెవెలుగు యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానం నకు చెందిన హక్కుభుక్తములైన కొబ్బరి చిప్పలు, తలనీలాలు పోగు చేసుకునే హక్కు కొరకు తేదీ 27 -10 - 2026 న ఉదయం 10-00 గంటలకు సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేల ము నిర్వహించబడును కావున ఆసక్తి, అర్హత గలవారు తగిన డిపాజిట్ చెల్లించి సదరువేలము పాటయందు పాల్గొనగలరు స్వామివారి సేవలో డి. పాండు రంగా రెడ్డి సహాయ కమిషనర్ మరియు జె వి ఓ కార్య నిర్వహణాధికారి మరియు బండి మౌళేశ్వర్ రెడ్డి ఆలయ చైర్మన్ మరియు సభ్యులు



# మండగిరి సర్పంచ్ పీఠంపై ఎన్డీఏ కూటమి గురి!

**అభ్యర్థిత్వం కోసం రేసులో కురువ పద్మావతి (మురళి).. టికెట్‌పై ఆసక్తికర చర్చ.**

ఆదోని (పల్లె వెలుగు), అక్టోబర్ 26: ఆదోని మండల పరిధిలోని మండగిరి గ్రామంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్డీఏ కూటమి సర్పంచ్ అభ్యర్థి ఎంపికపై ఆసక్తికర చర్చ సాగుతోంది. సర్పంచ్ అభ్యర్థిత్వం కోసం కురువ పద్మావతి (మురళి) పేరు ప్రముఖంగా వినిపిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గత కొన్నేళ్లుగా తెలుగుదేశం పార్టీకి సేవలందిస్తూ ప్రజలతో సన్నిహితంగా ఉంటున్న మురళికే సర్పంచ్ టికెట్ కేటాయించాలని స్థానిక నాయకులు పట్టుబడుతున్నట్లు సమాచారం.




మండగిరి కాలనీలో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ప్రజల మధ్య తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. మరోవైపు, పార్టీ అధిష్ఠానం కూడా మురళి అభ్యర్థిత్వం వైపు మొగ్గు చూపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, సర్పంచ్ అభ్యర్థిత్వం కోసం మరికొందరు కూడా పోటీలో ఉన్నట్లు టీడీపీ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో మండగిరి సర్పంచ్ అభ్యర్థిగా ఎన్డీఏ కూటమి ఎవరిని ఖరారు చేస్తుందన్న అంశం స్థానిక రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతోంది. చివరకు పార్టీ అధిష్ఠానం ఎవరికి అవకాశం కల్పిస్తుందో, మండగిరి సర్పంచ్ పీఠం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

# కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి

**జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ కి సంబంధించి పత్తికొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఆలూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఆదోని మండలం విరుపాపురం గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో , ఎమ్మిగనూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఓ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించి ఏర్పాటు చేసిన గదులను, స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ హాళ్లలో టేబుళ్ల ఏర్పాటు, సిబ్బంది రాకపోకలకు అనువైన మార్గాలు, రిసెప్షన్ కేంద్రాల నిర్వహణ, వాహనాల పార్కింగ్ నిర్వహణకు సంబంధించిన అంశాలను కలెక్టర్ పరిశీలిస్తూ సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. కౌంటింగ్ రూమ్ లోకి ఎంట్రన్స్ వద్ద బ్యారికేడింగ్ సక్రమంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ రూమ్ లో ఎక్కువ లైటింగ్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు, రిసెప్షన్ కేంద్రాలు పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, కౌంటింగ్ నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. కౌంటింగ్ రూమ్ లలో విద్యుత్ సరఫరా, లైటింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర అవసరమైన సౌకర్యాలను పరిశీలించి, లోపాలుంటే వెంటనే సరిచేయాలని కలెక్టర్ సంబంధిత అ ధి కా ర ు ల న ు ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు, భవనాల ముందు, వెనుక భాగాలు, ప్రవేశ ద్వారాలు, పరిసర ప్రాంతాల్లో అవసరమైన సంఖ్యలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోని ప్రతి కీలక ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించే విధంగా కెమెరాల ఏర్పాటు ఉండాలని, సీసీటీవీ ఫుటేజీని ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు.. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, సీసీటీవీ కెమెరాల ద్వారా లభించే ఫుటేజీని నిరంతరం పర్యవేక్షించేందుకు అవసరమైన మానిటర్లు, సాంకేతిక పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి కౌంటింగ్ విధుల కోసం వచ్చే సిబ్బందికి వాహనాల పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు చేరుకునే మార్గాలు, ప్రవేశ ద్వారాలు, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లకు వెళ్లే దారులకు సంబంధించి స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. రిసెప్షన్



కేంద్రాల్లో విధుల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించాలని, స్టాట్యూటరీ, నాన్-స్టాట్యూటరీ కౌంటర్లను అవసరానికి అనుగుణంగా ఏర్పాటు చేయాలన్నారు.

**జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ**

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అన్ని కేంద్రాల్లో పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.. కౌంటింగ్ కేంద్రాల వెనుక భాగాలు ఉండే ప్రాంతాల్లో వెలుతురు ఉండేలా ఫోకస్ లైట్లు ఏర్పాటు చేయాలని ఎస్పీ తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసే అన్ని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని ఒకేసారి వీక్షించే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, కీలక ప్రాంతాల్లో జరుగుతున్న కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, ఆదోని ఆర్డీఓ అరుణ దేవి, ఆదోని అదనపు ఎస్పీ జయ శర్మ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలపై ఆరా....డి ఎం హెచ్ ఓ.

**అందుబాటులో ఉండాల్సిందేనని వైద్యులకు ఆదేశాలు.**

రుద్రవరం.పల్లె వెలుగు : మండల కేంద్రం రుద్రవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ శారదా బాయ్ సందర్శించారు. జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపి సేవలు, మందుల నిలువలు, ల్యాబ్ సౌకర్యాలు, ప్రసూతి వార్డు ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు, హాజరు రిజిస్టర్ లను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్యాధికారి తప్పనిసరిగా అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కేంద్రానికి రాలేని పక్షంలో ముందుగా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించి గైర్హాజరైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# వన్య ప్రాణులు వాటి ఆవాసాల సర్వే.



రుద్రవరం. పల్లె వెలుగు : రుద్రవరం అటవీ రేంజ్ లోని అన్ని ఫారెస్ట్ బీట్ లలో వన్యప్రాణులు వాటి ఆవాసాల సర్వే నిర్వహిస్తున్నట్లు రుద్రవరం రేంజ్ అధికారి ముర్తుజావలి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నంద్యాల డిడి పిటి సి. చైతన్య కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 23 నుంచి 28 తేదీ వరకు రుద్రవరం రేంజ్ లో ఏ ఐ టి ఈ -2026 లో భాగంగా వన్యప్రాణులు అటవీ ఆవాసాల సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగముగా మొదటి మూడు రోజులు ప్రతి బీట్ కి 5 కి మి చొప్పున రుద్రవరం రేంజ్ పరిధి లోని 14 బీట్ల లో కాలినడకన అటవీ శాఖ సిబ్బంది తిరిగి ప్రత్యక్షంగా చూసిన మాంసాహార జంతువులు అయినటువంటి పులి, చిరుత, ఎలుగుబంటి, రేస్ కుక్క ,అడవి పిల్లి మొదలగు వాటిని మరియు పరోక్ష ఆనవాలు అయినటువంటి వాటి పాదముద్రలు మరియు విసర్జించిన పెంటికలను సేకరించడం జరుగుతుంది.తర్వాత మూడు రోజులు శాకాహార జంతువులు చుక్కల దుప్పి, కొండ గొర్రె ,అడవి పంది, సాంబార్, మనుబోతు వంటి వాటి జనాభను అంచనా వేయుటకు ప్రతి బీట్ లో ఉదయం సుమారు 6 గంటలకి రోజుకి2 కి మీ చొప్పున 3 రోజులు ట్రాక్టర్ లైన్ లో ఒకే దిశలో కాలి బాటన తిరిగడం జరుగుతున్నది.అలాగే అటవీ ఆవాసం ను అంచనా వేయడం జరుగుతుంది. ఇందులొ రుద్రవరం రేంజ్ అటవీ శాఖ సిబ్బంది తోపాటు డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ నుంచి వచ్చిన వాలంటీర్లు కూడా ఈ సర్వేలో పాల్గొంటున్నారన్నారు.

# వైస్సార్సీపీ నాయకులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



బనగానపల్లె, అక్టోబర్ 26,పల్లెవెలుగు బనగానపల్లె పట్టణం జమ్మిరెడ్డి కాలనీ కి చెందిన కొప్పెర్ల వెంకటరామిరెడ్డి ఆరోగ్యం సరిగా లేక చికిత్సపొంది స్వగృహానికి రావడంతో ,అలాగే కాపులపల్లె కొండారెడ్డి కి ఇటీవలే రోడ్డుప్రమాదానికి గురి అయి చికిత్స పొంది డిశ్చార్జ్ కావడంతో వారి స్వగృహాలకు వెళ్లి వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకొన్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ,అవుకు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి ఈ కార్యక్రమం లో సిద్ధంరెడ్డీ రామ్మోహన్ రెడ్డి,జిల్లెళ్ళ శంకర్ రెడ్డి,పాతపాడు వెంకటేశ్వర రెడ్డి, బండి బ్రహ్మానంద రెడ్డి, ఐ.వి.వెంకటరామిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు

# మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ...

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా



నిర్వహించారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి జీవితాన్ని, ఆయన రచించిన రామాయణం ద్వారా సమాజానికి అందించిన ధర్మం, నీతి, సత్యం వంటి విలువలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ నారాయణ, ఆర్ ఎస్సైలు, స్పెషల్ పార్టీ పోలీసులు, ఏఆర్ పోలీసులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్ కు దూరంగా ఉండాలి

మహానంది, పల్లె వెలుగు ర్యాగింగ్ కు దూరంగా ఉండాలని, తోటి విద్యార్థులతో సోదరభావంతో మెలగాలని మహానంది ఎస్సై శివాంజల్ పేర్కొన్నారు. సోమవారం మహానంది ఫారంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాలలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. చవాన్ శ్యామ్ రాజ్ నాయక్ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ హాజరై మాట్లాడారు.. వ్యవసాయరంగం చాలా ఉన్నతమైనదని, ఆ రంగంలో విద్యను అభ్యసిస్తున్న మీకు ఎంతో గౌరవం ఉంటుందన్నారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.విద్యార్థులు ర్యాగింగ్ అనే విష సంస్కృతికి దూరంగా ఉండాలన్నారు.సీనియర్లు, జూనియర్లు అనే భేదం వీడాలని ఆయన అన్నారు. ర్యాగింగ్ పట్ల చట్టాలు కఠినతరంగా ఉన్నాయని గుర్తు చేశారు.




కళాశాల అసోసియేట్ డీన్ మాట్లాడుతూ.. మహానంది కళాశాల విద్యార్థులకు క్రమశిక్షణకు మారుపేరు అన్నారు. సీనియర్లు, జూనియర్లకు మార్గదర్శకులుగా నిలిచి, వారి చదువు వ్యక్తిత్వ వికాసానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఘన నివాళులు

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని కర్నూలు జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయంలో సోమవారం వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, కార్యాలయ పరిపాలన అధికారి రవి కుమార్ తదితరులు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలు సమర్పించి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి జీవిత విశేషాలను, సమాజానికి ఆయన



అందించిన విలువైన సందేశాలను స్మరించుకున్నారు. భారతీయ సాహిత్యంలో ఆదికవిగా ప్రసిద్ధి చెందిన మహర్షి వాల్మీకి రచించిన రామాయణం తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. రామాయణం ద్వారా ఆయన అందించిన ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలు సమాజానికి స్ఫూర్తినిస్తున్నాయని గుర్తుచేశారు. వాల్మీకి మహర్షి జీవితం, ఆయన సాహిత్య సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన బోధనలు సమాజంలో నైతిక విలువలను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. మహర్షి ఆశయాలను స్మరించుకుంటూ సమాజ అభ్యున్నతికి, సద్గుణాల పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com